# చెట్టు పేరుచెప్పి

దొంగతనాలు కానీ దోపిడీలుకానీ మోసాలుకానీ ఒళ్ళు వంచకుండా డబ్బు సంపాదించాలనుకునే వాళ్లే చేస్తారు.

సాధారణంగా దొంగతనాలూ దోపిడీలూ ఒక పద్ధతిలోనే జరుగుతాయి.



మోసాలు మాత్రం రకరకాలుగా జరుగుతాయి. ఒకప్పుడు మోసాలు గప్‌చిప్‌గా జరిగేవి. ఇప్పుడు బాహాటంగానూ జరుగుతున్నాయి. అందంగానూ జరుగుతున్నాయి. అట్టహాసంగానూ జరుగుతున్నాయి.

ఇవి ఇలా జరగడానికి తెలివితేటలుండాలి. కొందరు తమ తెలివితేటల్ని మంచి పద్ధతిలో ఉపయోగిస్తారు. ఉన్నతస్థితికి వెళ్తారు. మంచి పేరూ తెచ్చుకుంటారు. మరికొందరు తమ తెలివితేటల్ని దుర్వినియోగం చేస్తారు. ఎప్పుడో ఒకప్పుడు దొరికిపోతారు. దిగజారిపోతారు.

మోసాలు జరగడానికి మోసగాళ్ళే కాకుండా ప్రజల అమాయకత్వమూ, పేరాస కూడా కారణం.

ఎక్కువగా మధ్య తరగతివాళ్ళే మోసపోతుంటారు. అలాగని ఉన్నత వర్గాలవారు మోసపోరని కాదు. తమకొచ్చే జీతాల నుంచి కొంత పొదుపు చేసే వాళ్లుంటారు. బ్యాంకులు ఇచ్చే వడ్డీ తృప్తినివ్వదు.

ఆకర్షణీయమైన పేరుతో ఏదో ఒక చిట్‌ఫండ్ కంపెనీ క్రొత్తగా వెలుస్తుంది. పెద్ద బిల్డింగులో ఉంటుంది. ఖరీదైన ఫర్నిచర్ ఉంటుంది. ఆఫీసు చాలా అట్టహాసంగా ఉంటుంది. ఆ కంపెనీ చూపే వడ్డీరేటు జాగ్రత్తపరుల్ని కూడా ప్రలోభపెట్టేలా ఉంటుంది. అనేకమంది చీటీలు కడతారు, కొన్ని వారాలకో నెలలకో ఓ సుముహూర్తం చూసుకుని ఆ కంపెనీ దుకాణం ఎత్తేస్తుంది. చీటీలు కట్టినవాళ్లు తాము చీట్ అయ్యామని తెలుసుకుని లబోదిబోమంటారు.

మరేదో కంపెనీ వస్తుంది. చక్కటి ప్రచారం ప్రారంభిస్తుంది. సగం డబ్బు కట్టి మీక్కావాల్సిన టీవీ కానీ ఫ్రిజ్‌కానీ వాషింగ్‌మెషిన్ కానీ ఇంటికి పట్టుకుపోవచ్చు అంటుంది. మిగతా సొమ్ము వాయిదాల్లో కట్టొచ్చు అంటుంది. వచ్చేనెల్లో లాటరీ తీస్తామనీ అది కానీ తగిలితే వాయిదాలు కట్టక్కర్లేదనీ అంటుంది. మొదటి ఒకటి రెండు రోజులు సగం సొమ్ము కట్టిన వాళ్ళకు వాళ్ళక్కావాల్సిన వస్తువులిస్తుంది. ఒకరినుంచి ఒకరికి అలాఅలా చాలామందికిది తెలుస్తుంది. జనం తండోపతండాలుగా వెళ్తారు. సగం డబ్బు కట్టించుకుని 'స్టాక్ అయిపోయింది. ఆర్డరిచ్చాం నాలుగురోజుల్లో ఇస్తాం' అని అందంగా హుందాగా కబుర్లు చెబుతారు ఆ కంపెనీవాళ్ళు. కొన్ని లక్షలు సంపాదించాక ఈ కంపెనీవాళ్లుకూడా జెండా ఎత్తేస్తారు. పొదుపు చేసిందో, అప్పు చేసిందో నష్టపోయిన జనం గుండెలు బాదుకుంటారు. కొందరయితే సిగ్గుతో బయటకు చెప్పుకోలేకపోతారు.

ఇంకేదో మనీ టర్నోవర్ స్కీమ్ ప్రత్యక్షమవుతుంది. వెయ్యి రూపాయలు కడితే ఆరునెలల్లో పదిరెట్లు పెరుగుతుందంటారు. ఇక్కడా షరామామూలే.

ఒకే స్థలాన్ని పదిమందికి అమ్మేసిన ఘనుల భూమి భాగోతాలు మనకు తెలుసు.

ఇప్పుడు కొందరు చెట్లనుకూడా విడిచిపెట్టడం లేదు. ఇటీవల టేకు చెట్ల స్కీములు మొదలయ్యాయి. ఫలానాచోట టేకు ప్లాంటేషన్ ప్రారంభిస్తున్నామనీ ఒక టేకు చెట్టుకి వెయ్యి రూపాయాలు కడితే ఇరవై ఏళ్ళలో ఇరవైవేలు వస్తాయనీ ప్రకటనలిస్తున్నారు. ఒక వ్యక్తి ఎన్ని టేకుచెట్లనైనా బుక్ చేసుకోవచ్చని, ఈ స్కీములో చేరడంద్వారా ఒకపక్క డబ్బు పెంచుకోవచ్చనీ మరోపక్క పరోక్షంగా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడిన వారవుతారనీ వాళ్ల ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే ఈ స్కీముల్లో కొందరు చేరారు. మరికొందరు చేరనున్నారు..

అయితే ఇదీ ఓ పెద్ద మోసమే!

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న టేకు ప్లాంటేషన్‌లో పెట్టుబడి పెట్టి మోసపోవద్దు అని అటవీ శాఖ మంత్రి మోహనరావు ప్రజల్ని హెచ్చరించారు. ఇరవై ఏళ్ళల్లో టేకు ఎదుగుదల ఉండదని ఆయన స్పష్టం చేశారు.

మరి మంత్రిగారి మాట వింటే మనకే మంచిది. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజం ఉండదు కదా!

7.4.93

ఆంధ్రభూమి దినపత్రిక